క్లుప్తంగా

వేంకటేశ్వర స్వామికి విశేష పూజలు



సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు

రుద్రవరం: రుద్రవరం–అప్పనపల్లె దారిలో కొలువైన వాసాపురం వేంకటేశ్వరస్వామికి శనివారం భక్తులు విశేష పూజలు నిర్వహించారు. ఉదయాన్నే అర్చకులు లక్ష్మీ,గోదా సమేత వేంకటేశ్వరస్వామి అమ్మవార్లను అభిషేకించి ప్రత్యేకంగా అలంకరించి భక్తులను దర్శనానికి అనుమతించారు. సామూహిక కుంకుమార్చనలో మహిళలు అధికంగా పాల్గొన్నారు. స్థానికులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలి వచ్చిన భక్తులు స్వామి అమ్మవార్లకు పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

అధ్యాపకురాలికి డాక్టరేట్



లలితను సత్కరిస్తున్న అధ్యాపకులు

నంద్యాల(న్యూటౌన్): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల గణితశాస్త్ర అధ్యాపకురాలు లలితకు శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసిందని ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ శనివారం తెలిపారు. ప్రొఫెసర్ మల్లికార్జున రెడ్డి మార్గదర్శకంలో గణితశాస్త్రంలో కోడింగ్, డీ కోడింగ్‌లో నిర్దిష్ట వలయాల్లోని ఉత్పన్నాలపై కొన్ని అధ్యయనాలు అనే అంశంపై పరిశోధన పత్రం సమర్పించడంతో డాక్టరేట్ అందజేశారని చెప్పారు. డాక్టర్ శ్రీనివాసులు, అధ్యాపకులు అభినందించారు.

పెండింగ్ బకాయిలు చెల్లించాలి

నంద్యాల(అర్బన్): ఉద్యోగుల పెండింగ్ బకాయిలు తక్షణమే చెల్లించాలని ఏపీ ఎన్‌జీఓస్ అసోసియేషన్ నంద్యాల తాలూకా అధ్యక్షుడు మణిశేఖర్‌రెడ్డి కోరారు. రాష్ట్ర ఐక్య కార్యాచరణ సమితి పిలుపు మేరకు శనివారం ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులు, పెన్షనర్లతో కలిసి సమస్యల పరిష్కారం కోరుతూ ఏపీ ఎన్‌జీఓ హోమ్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ చేసి, ధర్నా నిర్వహించారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసులు, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు మౌలాలి, రామచంద్రారెడ్డి, నర్సారెడ్డి, నారాయణరెడ్డి, రాముడు, గోవిందు, ఎల్లయ్య పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు మార్గదర్శకాలు పాటించాలి



ఎస్పీ రఘువీర్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న వైద్యులు

నంద్యాల టౌన్: ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఎవరైనా మృతి చెందితే వైద్యుల నిర్లక్ష్యం వలన రోగి మృతి చెందాడని మృతుని బంధువులు భావిస్తే వైద్యులపై ఫిర్యాదు చేసే సమయంలో సుప్రీంకోర్టు మార్గదర్శకాలు పాటించాలని నంద్యాల ఐఎంఏ వైద్యులు కోరారు. శనివారం ఈ మేరకు జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. రాష్ట్ర ఐఎంఏ మాజీ అధ్యక్షుడు, యాక్షన్ కమిటీ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ రోగికి సరైన వైద్యం అందలేదని భావిస్తే ఆసుపత్రి, వైద్యుడిపై కేసు నమోదు చేసే హక్కు బాధితులకు ఉందన్నారు. అయితే కేసు నమోదు సమయంలో పోలీసు సిబ్బంది సుప్రీంకోర్టు తీర్పులను అనుసరించి ముందుగా ఆ వైద్య విభాగానికి చెందిన ప్రభుత్వ వైద్యులతో కూడిన కమిటీ విచారణ చేసి, రికార్డులు పరిశీలించి ప్రాథమిక ఆధారాలు ఉన్నాయని భావించినప్పుడే కేసు నమోదు చేయాలని గుర్తు చేశారు. ఎస్పీ మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు, చట్టాలకనుగుణంగా చర్యలు చేపడతామని చెప్పారు. ఐఎంఏ నంద్యాల అధ్యక్షురాలు డాక్టర్ వసుధ రాణి, కార్యదర్శి డాక్టర్ పనిల్ కుమార్ పాల్గొన్నారు.

వైశ్యులు రాజకీయంగా ఎదగాలి

నంద్యాల(వ్యవసాయం): వైశ్యులు రాజకీయంగా ఎదగాలని ఆర్యవైశ్య పరిరక్షణ సమితి సభ్యులు ఖండే శ్యాంసుందర్‌లాల్, బింగుమళ్ల శ్యాంసుందర్ గుప్తా పేర్కొన్నారు. శనివారం స్థానిక వాసవీ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాజకీయాల్లో నానాటికీ వైశ్యుల ప్రమేయం తగ్గిపోతుందన్నారు. సమర్థులైన వారిని ప్రోత్సహించాలని సూచించారు. నంద్యాల నియోజకవర్గంలో ఆర్యవైశ్యుల ఓట్లు 36వేలు ఉన్నాయని, సార్వత్రిక ఎన్నికల్లో చాలా మంది ఓటుకు దూరంగా ఉంటున్నారని, అది సరికాదని, ఓటుహక్కును సద్వినియోగం చేసు కోవాలని కోరారు. అందరూ కలిసికట్టుగా ఉంటేనే న్యాయం జరుగుతుందని, లేకపోతే అణిచివేతకు గురికావాల్సిందేనన్నారు. జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు భవనాసి మహేష్, నాగరాజు, కొత్త సుబ్బయ్య, సతీష్‌కుమార్, సుధాకర్, జనార్దన్ పాల్గొన్నారు.

‘జల్‌జీవన్’ను సక్రమంగా నిర్వహించాలి

గోస్పాడు: జల్‌జీవన్ మిషన్ పథకాన్ని సక్రమంగా నిర్వహించాలని ఎంపీడీఓ అనసూయ, ఏఈఈ నవీన తెలిపారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జల్‌జీవన్ మిషన్ కార్యక్రమంపై గ్రామ జల సంఘాలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ కార్యక్రమం ద్వారా గ్రామాల్లో ఇంటింటికీ తాగునీటి సరఫరా చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. అందులో భాగంగా గ్రామ జలసంఘాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. సంఘంలో 11మంది సభ్యులతో పాటు గ్రామ పంచాయతీ కార్యదర్శి, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు సభ్యులుగా ఉంటారని, గ్రామాల్లో జల జీవన్ మిషన్ పనుల్లో సభ్యులు కీలక పాత్ర వహిస్తారన్నారు. వీరందరికీ గ్రామంలో జాయింట్ అకౌంట్ నిర్వహించాలని సచివాలయ కార్యదర్శులకు సూచించారు.

వైభవంగా ఊంజల సేవ



ఊయలలో ఆశీనులైన ఉత్సవమూర్తులు

నంద్యాల(వ్యవసాయం): స్థానిక సంజీవనగర్‌లో వెలసిన శ్రీభద్రావతి భావనా ఋషి స్వామి దేవాలయంలో పట్టణ పద్మశాలీయ సంఘం ఆధ్వర్యంలో శనివారం వసంతోత్సవం వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఉదయాన్నే స్వామి వారి మూల విరాట్‌కు సుప్రభాత సేవ పంచామృతాభిషేకాలు చేపట్టి ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం ఉత్సవమూర్తులకు ఊంజల సేవా కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా జరిపించారు.

కొనసాగుతున్న తిక్కస్వామి ఉరుసు



నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని సాయిబాబ నగర్‌లో వెలసిన తిక్కస్వామి దర్గా ఉరుసు మూడవ రోజు శనివారం కొనసాగియింది. ఈ సందర్భంగా స్వామివారికి భక్తులు పూలమాలలు, చాదర్లు సమర్పించి ఫాతెహాలు చేపట్టారు. దర్గా నిర్వహకులు భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం, రాత్రి వేళల్లో అన్నప్రసాద వితరణ గావించారు. అల్లాబకాష్ మాట్లాడుతూ ఆది, సోమవారాల్లో ఎద్దుల బల ప్రదర్శన ఉంటుందని చెప్పారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

ఉయ్యాలవాడ : మాఘమాసం పురస్కరించుకుని మండలంలోని ఆలయాల్లో భక్తులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆర్.జంబులదిన్నె, ఉయ్యాలవాడ గ్రామాల్లో వెలిసిన అభయాంజనేయస్వామి, ఇంజేడు గ్రామంలో వెలిసిన శ్రీ లక్ష్మీవేంకటేశ్వర స్వామి, సుద్దమల్ల గ్రామంలో వెలిసిన శ్రీ లక్ష్మీ నరసింహ కంబగిరిస్వామి ఆలయాల్లో భక్తులు అభిషేకాలు, కుంకుమార్చన, ఆకుపూజ, ప్రత్యేక పూజలు చేపట్టారు. అర్చకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

సేవారత్నకు వలంటీర్ల ఎంపిక

శిరివెళ్ల: మండలంలో ఐదుగురు వలంటీర్లు సేవారత్న పురస్కారానికి ఎంపికయ్యారని ఈఓఆర్డీ నాగేంద్ర శనివారం తెలిపారు. చెన్నూరు గ్రామ సచివాలయంలో ప్రసాదు, గోవిందపల్లె –1 సచివాలయంలో షహినాబీ, గుంప్రమాన్‌దిన్నెలో లక్ష్మీ ప్రసన్న, మహదేవపురంలో స్వప్న, కోటపాడు సచివాలయం నుంచి మౌలాలి ఎంపికయ్యారని చెప్పారు. వారికి త్వరలో ఎమ్మెల్యే పురస్కారం అందజేసి సన్మానిస్తారని పేర్కొన్నారు.

సిబ్బంది అలసత్వం వీడాలి

నంద్యాల(సిటీ): పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణలో సిబ్బంది అలసత్వం వీడాలని మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి అన్నారు. శనివారం సాయంత్రం పట్టణంలోని మూలసాగరం 31వ వార్డులో పారిశుద్ధ్య పనులను శానిటరీ సూపర్‌వైజర్ లక్ష్మీనారాయణతో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ దోమల నివారణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

బొగ్గులైన్ నిర్వాసితులు సహకరించాలి

నంద్యాల(సిటీ): పట్టణంలోని నూనెపల్లె–బొమ్మల సత్రం మధ్యలోనున్న బొగ్గులైన్ నిర్వాసితులు ప్రభుత్వానికి, అధికారులకు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. గతంలో రెండు విడతలుగా బొగ్గులైన్‌లో నివాసం ఉంటున్న నిర్వాసితులందరికీ ప్రభుత్వం ఇళ్ల పట్టాలు ఇచ్చిందన్నారు. కావున ఆదివారం సాయంత్రంలోపు వారు ఆక్రమించిన స్థలాలను ఖాళీ చేయాలని కోరారు. ఖాళీ చేయని వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని పేర్కొన్నారు.

కోలుకోలేక మహిళ మృతి

శిరివెళ్ల: మోత్కలపల్లెకు చెందిన పిరుదుల ఎస్తేరమ్మ (50) చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందిందని ఎస్‌ఐ సురేష్ శనివారం తెలిపారు. గతేడాది నవంబర్ 12న కుమారుడు రాజ్‌కుమార్‌తో కలిసి బైక్‌పై శిరివెళ్ల మెట్ట వద్దనున్న చర్చికి వెళ్తుండగా మాధవరెడ్డి గార్డెన్ వద్ద నంద్యాల నుంచి శిరివెళ్లకు వస్తున్న కారు వేగంగా వచ్చి బైక్‌ను ఢీకొట్టింది.దీంతో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. ఎస్తేరమ్మ కోమాలోకి వెళ్లిపోయింది. నంద్యాల, కర్నూల్, హైదరాబాద్ ఆస్పత్రుల్లో చికిత్స చేయించినా ఫలితం లేకపోయింది. దీంతో ఈనెల 15న స్వగ్రామానికి తీసుకురాగా శుక్రవారం రాత్రి మృతి చెందింది. ప్రమాదంపై నాడు భర్త సుబ్బయ్య ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

నంద్యాలకు నీటి ఎద్దడి రాకుండా చర్యలు



అమృత్ ప్రాజెక్ట్ పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ అధికారులు

నంద్యాల(సిటీ): వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని నంద్యాల పట్టణానికి నీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి తెలిపారు. శనివారం మున్సిపల్ అధికారులతో కలిసి వెలుగోడు రిజర్వాయర్ నుంచి నంద్యాల పట్టణానికి నీటిని తరలించే కేసీ కెనాల్ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కెనాల్ పరివాహక రైతులు మోటార్లతో నీటిని తరలిస్తుండడంతో నంద్యాలలోని సమ్మర్ స్టోరేజ్‌కి నీటి సరఫరా తగ్గుతుందన్నారు. ఈ విషయంపై ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులకు నివేదించామని చెప్పారు. అనంతరం వెలుగోడు రిజర్వాయర్ నుంచి పట్టణానికి నీటిని తరలించేందుకు ఏర్పాటు చేస్తున్న అమృత్ ప్రాజెక్ట్ పనులను పరిశీలించి నాణ్యత లోపించరాదని సూచించారు. మున్సిపల్ ఇంజినీర్ రమణమూర్తి, డీఈఈ శ్రీనివాసరెడ్డి ఉన్నారు.

అలరించిన అష్టావధానం



బోడెమ్మనూరు హైస్కూల్‌లో అష్టావధానం చేస్తున్న దృశ్యం

ఉయ్యాలవాడ : మండలంలోని బోడెమ్మనూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో తిరుపతి పట్టణానికి చెందిన అవధానం బాలభాస్కర్, శ్రీ భరత్ శర్మ నిర్వహించిన అష్టావధాన ప్రక్రియ విద్యార్థులను అలరించింది. ముందుగా విద్యార్థులకు అవధానం ప్రక్రియను ఎంపిక చేసుకుని ప్రశ్నలు, అక్షరాలు, పదాలను జోడించడం, తదితర అంశాలపై క్లుప్తంగా వివరించారు. ఒక పద్యం, వచన కావ్యం తీసుకుని వివిధ పృచ్ఛకులు సంధిస్తూ ఆసక్తిగా సాగింది. సంస్కృత పండితుడు హయగ్రీవాచార్యులు తెలుగు సాహిత్య ప్రక్రియకే తలమానికమైన అవధాన ప్రక్రియను విద్యార్థులకు పరిచయం చేశారు. అనంతరం అష్టావధానం చేసిన వారిని ఘనంగా సత్కరించారు. హెచ్ఎం చంద్రశేఖరయ్య, బర్డ్స్ సంస్థ చైర్మన్ పోచా వెంకటరెడ్డి, కమిటీ సభ్యులు కర్నాటి రామకృష్ణారెడ్డి, ఎంఈఓ వీరప్రతాప్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలందించాలి



నర్సాపురం పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

రుద్రవరం: ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలని నంద్యాల జిల్లా ప్రోగ్రాం అధికారులు జగదీష్ చంద్రారెడ్డి, సునీత వైద్య సిబ్బందికి సూచించారు. నర్సాపురం పీహెచ్‌సీని శనివారం తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు,అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. వారు మాట్లాడుతూ పీహెచ్‌సీలోనే కాన్పులు చేయాలన్నారు.ఆరోగ్యశ్రీ కార్డులు, ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన కార్డులను త్వరగా పంపిణీ చేయడంతో పాటు గ్రామాల్లో ప్రజలకు వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పై అవగాహన కల్పించాలని చెప్పారు. పీహెచ్‌సీ వైద్యాధికారి బాబు ఉన్నారు.

జాగ్రత్తలు పాటిస్తే టీబీ నయం

గడివేముల: క్రమం తప్పకుండా మందులు వాడుతూ జాగ్రత్తలు పాటిస్తే టీబీ నయమవుతుందని నంద్యాల జిల్లా అడిషనల్ డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ శారదబాయి అన్నారు. శనివారం టీబీ ముక్త్ పంచాయతీ కార్యక్రమంలో భాగంగా గడివేముల మండలం ఒండుట్ల గ్రామ పంచాయతీలో పర్యటించారు. స్థానిక వైద్యశాలలో రికార్డులను పరిశీలించారు. వైద్య సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. టీబీ రోగులకు ప్రభుత్వ అందిస్తున్న వైద్యం సేవల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామంలో రెండు వారాల కంటే దగ్గు, జలుబు ఉన్నవారిని పరిశీలించి ఉచితంగా మందులను పంపిణీ చేయాలని తలముడిపి పీహెచ్‌సీ డాక్టర్ చిన్నమద్దిలేటికి సూచించారు. ప్రభుత్వాస్పత్రుల్లో వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం గ్రామంలో నూతనంగా నిర్మించిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్ సెంటర్‌ను పరిశీలించారు. ఆమె వెంట ఎస్‌పీఎం డాక్టర్ సుహాసిని, ఎంఎల్‌హెచ్‌పీ పవన్ ఉన్నారు.

21న ఓంకారంలో వేలాలు

మహానంది : బండిఆత్మకూరు మండలంలోని ప్రముఖ శైవక్షేత్రమైన ఓంకారంలో ఈ నెల 21న బహిరంగ వేలాలు నిర్వహించనున్నట్లు ఈఓ ఏ.నాగప్రసాద్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ క్షేత్ర పరిధిలో టెంకాయలు అమ్ముకునేందుకు, ఐస్‌క్రీం బండ్ల నిర్వహణ, పాదరక్షలు భద్రపరుచుకునేందుకు బహిరంగ వేలాలు ఉంటాయన్నారు. ఆసక్తి కలిగిన వారు రూ.పదివేలు డిపాజిటు చెల్లించి వేలాల్లో పాల్గొనాలని కోరారు. ఇదిలా ఉండగా ఇప్పటికే రెండు సార్లు బహిరంగ వేలాలు నిర్వహించగా వాయిదా పడిన విషయం తెలిసిందే. దీంతో ముచ్చటగా మూడోసారి అయినా జరిగేనా అంటూ మండల ప్రజలు చర్చించుకుంటున్నారు.